**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

**తేది : 02 మే, 2023.**

## కుండపోత వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

గత రెండు రోజులుగా రాష్ట్రమంతట కురిసిన కుండపోత వర్షాలవల్ల లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగింది. పంట పూర్తి అయి కళ్ళాల్లో వున్న ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారంతో పాటు, పంట పెట్టుబడి సహాయం (ఇన్ పుట్ సబ్సిడీ), క్రాప్ ఇన్సూరెన్సు చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

అత్యధిక వర్షపాతం వల్ల 14 జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయినట్లు తెలుస్తుంది. ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా, నంద్యాల, ఉభయ గోదావరి, అనంతపురం, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలో పంటల నష్టం అధికంగా వుంది. వరి, మొక్కజొన్న, రాగి, వేరుశెనగ, నువ్వులు, పత్తి, మిరప, పసుపు, టమోటా తదితర పంటలు తీవ్రంగా పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి పంట నష్టపోగా, ఏలూరు జిల్లాలో 13 వేల టన్నుల ధాన్యం కల్లాల్లో తడిసిపోయినట్లు అధికారులు ప్రకటించారు. అలాగే కోనసీమ జిల్లాలో పది వేల ఎకరాల్లోని వరి పంట తడిసిపోయింది. కృష్ణా జిల్లాలో 28 వేల క్వింటాళ్ల పసుపు పంట నష్టపోయింది. ఎన్టీఆర్ జిల్లాలో 56 ఎకరాల్లో పంటలు నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. నంద్యాల జిల్లాలో 4వేల ఎకరాల్లో వరిపంట, మరో రెండు వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. అనంతపురం జిల్లాలో 16 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఎకరాకు 25 వేలు నష్టపరిహారం రైతులకు చెల్లించాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు కార్డులతో నిమిత్తం లేకుండా పరిహారం అందేట్లుగా చర్యలు చేపట్టాలని కోరుతున్నది.

కోట్ల రూపాయల విలువైన ఉద్యానపంటలు నష్టపోయాయి. ముఖ్యంగా మామిడి, బొప్పాయి, అరటి, చీనీ, నిమ్మ, దానిమ్మ, మునగ, తమలపాకు తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో కురిసిన వడగండ్ల వర్షానికి ఉద్యానపంటలు పూర్తిగా నష్టపోయాయి. నష్టపోయిన ఉద్యానవన పంటలకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రైతులను, కౌలు రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) కోరుతున్నది.

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి